ప్రజాశక్తి
సోమవారం 24 నవంబర్ 2025 5 అనంతపురం

సత్యసాయి మార్గం ప్రపంచవ్యాప్తం

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

సత్యసాయిబాబా సూచించిన సేవామార్గాం ఒక్క దేశానికే పరిమితం కాలేదని.. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి తెలియజేశారు. సమానత్వం, సేవ, ఆధ్యాత్మికత ఇవన్నీ సత్యసాయి ట్రస్ట్ మూల ధ్యేయాలని చెప్పారు. పుట్టపర్తిలో గ్రామస్తుల కోసం చిన్న జనరల్ హాస్పిటల్‌గా ప్రారంభమైన వైద్యసేవలు ప్రస్తుతం ప్రపంచ స్థాయి ఉచిత కార్డియాక్, సూపర్ స్పెషాలిటీ వైద్యసంస్థలుగా ఎదగడం బాబా దివ్యకార్యానికి సాక్ష్యమన్నారు. సాయి పాఠశాలలు అందిస్తున్న విలువలతో కూడిన ఉచిత విద్య, తెలివితేటలతో పాటు వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో గొప్ప పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సత్య సాయి బాబా నేతత్వంలో అభివృద్ధి చెందిన గ్లోబల్ సేవా ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని సేవా భావంతో ఐక్యం చేసిందని తెలియజేశారు. బాబా శతాబ్ది ఉత్సవాలు ఒక జ్ఞాపకం మాత్రమే కాక, భవిష్యత్తు తరాలకు సేవా మార్గంకు నాందిగా నిలవాలని ఆకాంక్షించారు.

సేవతో సమస్యకు పరిష్కారం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



కష్టంలో ఉన్న వారికి తమవంతు సాయం అందించి సేవ చేయడం ద్వారా వారి సమస్యకు పరిష్కారం చూపిన వారం అవుతాయని చెప్పిన మహనీయుడు సత్యసాయిబాబా అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలియజేశారు. ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తిమార్గంతో కోట్ల మంది జీవితాలను బాబా ప్రభావితం చేశారన్నారు. చిత్రావతి నది ఒడ్డున పుట్టపర్తిని ఆధ్యాత్మికత, దైవత్యానికి నిలయంగా మార్చారన్నారు. 'లవ్ ఆల్, సర్వ్ ఆల్వ్.. హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్' అని సత్యసాయి బోధనలు ప్రజలందరూ ఆచరించాల్సిన సూత్రాలు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా సిద్ధాంతాలతో బాబా నూతన అధ్యాయం ప్రారంభించారని కొనియాడారు. 1960లో బాబా స్థాపించిన సత్యసాయి సంస్థలు తమ సేవలతో శ్వశాంతి, విశ్వ సౌభాగ్యం, సకల జనుల సంక్షేమాన్ని కోరుకుంటోందన్నారు. ఆయన లేకపోయినా ఆయన నింపిన స్ఫూర్తి ఉందని, ప్రశాంతి నిలయం ఒక ఎనర్జీ సెంటర్ అన్నారు. విద్య, వైద్యం, ప్రజలకు మౌలిక వసతులు ఇలా అన్నింటిలోనూ సత్యసాయి ట్రస్టు భాగస్వామ్యం అవుతోందన్నారు. సత్యసాయి బోధనల ద్వారా వసుదైక కుటుంబం అన్న వదాన్ని నిలబెట్టుకుందామని ముఖ్యమంత్రి తెలియజేశారు.

ప్రభుత్వాలు చేయలేని చోట బాబా సేవలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కొన్ని ప్రాంతాల్లో అక్కడి ప్రభుత్వాలు చేయలేని చోట కూడా సత్యసాయి ట్రస్ట్ ప్రజలకు సేవలు అందించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలియజేశారు. సత్యసాయిబాబా ప్రజల్లోనే దేవుడిని చూసారన్నారు. ప్రేమతో వారిని గెలుచుకున్నారని తెలిపారు. ప్రేమ ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందనే బాబా సందేశం యుగయుగాల పాటు ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. బాబా భౌతికంగా లేకపోయినా ఆయన ఆలోచనలు, సేవాస్ఫూర్తి శత జయంతి ఉత్సవాల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వాలు అందించలేని చోట కూడా బాబా ట్రస్ట్ చేపట్టిన సేవలు లక్షలాది మందికి జీవనాధారం అయ్యాయని గుర్తుచేశారు. విద్య, వైద్యం, తాగునీరు రంగాల్లో బాబా చేసిన సేవలు తరతరాలు గుర్తుంటాయన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే బాబా సిద్ధాంతం కేవలం బోధనే కాదు, నమ్మకంగా, అమల్లోనూ నిలిచిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సాయిబాబా శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి తెలియజేశారు.

కమనీయం.. శతజయంతి వైభవం

శ్రీ సత్యసాయి బాబా శత జయంతోత్సవాలు అంగరంగా వైభవంగా జరిగాయి. గత వారం రోజులుగా జరుగుతున్న వేడుకలు బాబా జయంతి రోజున ఆదివారం ఆద్యంతం కమనీయంగా కొనసాగింది. పుట్టపర్తి పట్టణం హిల్ వ్యూ స్టేడియంలో అద్భుత ఏర్పాట్లతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సాయి నామ సంకీర్తనలు, అన్ని రాష్ట్రాల సాయిభక్త బంద ప్రదర్శనల చేపట్టిన మార్చ్ ఫాస్ట్ ఆకట్టుకుంది. ప్రముఖ గాయకులు మనో, శివమణి సంగీత విభావరితో అలరించారు. మనో సంగీత సాహిత్యానికి అనుగుణంగా సత్యసాయి స్వర్ణ రథం ముందుకు సాగింది. బాబా స్వర్ణ రథాన్ని చూసేందుకు బాబా భక్తులు పుట్టపర్తి వీధుల్లో పెద్ద సంఖ్యలో బారులుదీరారు. స్వర్ణ రథం సాగుతున్న సేపూ పుట్టపర్తి వీధులు బాబా నామసంకీర్తనతో మారుమోగాయి.

శతజయంతి ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పుట్టపర్తిలో స్వర్ణ రథంలో సత్యసాయి బాబా చిత్ర పటం ఊరేగింపు

సత్యసాయి బాబా స్వర్ణరథం ముందు రత్నాకర్, తదితరులు

సత్యసాయి జయంతి వేడుకలను వీక్షిస్తున్న భక్తులు

- కన్నుల పండుగలా బాబా శతజయంతి వేడుకలు
- సాయినామ స్మరణతో మారుమోగిన హిల్‌వ్యూ స్టేడియం
- ప్రపంచ పర్యాటకులతో పులకించిన పుట్టపర్తి
- హాజరైన ఉపరాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్, ఆంధ్ర, తెలంగాణ ముఖ్యమంత్రులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
పుట్టపర్తి రూరల్

సత్యసాయిబాబా జన్మించి వంద సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో గత వారం రోజులుగా పుట్టపర్తి శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం నాడు బాబా పుట్టినరోజు కావడంతో ప్రముఖులతోపాటు, జనం పెద్దఎత్తున పుట్టపర్తికి తరలొచ్చారు. జనం సందోహంకు తోడు నిర్వహించిన కార్యక్రమాలు అంబరాన్నంటాయి. వివిధ రూపాల్లో నిర్వహించిన నృత్య ప్రదర్శనలతోపాటు, గేయాలపనలు ఆకట్టుకున్నాయి. సత్యసాయిబాబా బంగారు రథంపై ఊరేగింపుతోపాటు స్టేడియంలో భక్తుల మార్చ్‌ఫాస్టు ఆకట్టుకున్నాయి. మిళమిళ మెరిసే విద్యుత్ దీపాలంకరణల్లో సాయిబాబా చిత్రపటాన్ని ఊయలలో ఊపుతూ చేపట్టిన ప్రదర్శనతో భక్తులు పరవశించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భారత ఉప రాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఎ.రేవంత్‌రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, సత్యకుమార్ యాదవ్ తమిళనాడు మంత్రి శేఖరబాబు, శ్రీ సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, ఆల్ ఇండియా అధ్యక్షులు నిమిష్ పాండ్యాతో పాటు దేశ విదేశాలకు చెందిన బాబా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేవల ప్రతిరూపం సత్యసాయిబాబా

ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్

శాంతి, ప్రేమ, నిస్వార్థ సేవల ప్రతిరూప సత్యసాయిబాబా అని ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ తెలియజేశారు. అందరినీ ప్రేమించండి.. అందరికీ సాయం చేయండి అంటూ ఆయన చేసిన బోధనలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నాయన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ దేశవ్యాప్తంగా అందిస్తున్న మహత్తర సేవలు మరువలేనివన్నారు. ఉచిత విద్య అందిస్తున్న సత్యసాయి విశ్వవిద్యాలయం, గ్రామీణ ఆరోగ్య సేవలు, ఉచిత గుండె శస్త్రచికిత్సలు, తాగునీటి ప్రాజెక్టులు, విపత్తు సహాయ కార్యక్రమాలు లక్షలాది మందికి జీవనాధారం అవుతున్నాయని పేర్కొన్నారు. సేవ, ప్రేమ, శాంతి తదితర బాబా సూక్తులను మాటల్లో కాకుండా వారసత్వంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు.

శతజయంతి వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ, ఆంధ్ర ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, మంత్రి నారాలోకేశ్

కలగా మరిన లెదర్ ఫ్యాక్టరీ ప్రారంభం

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని రాచేపల్లి వద్ద ఉన్న లెదర్ ఫ్యాక్టరీ పున:ప్రారంభం ఓ కలగా మారింది. ప్రతి ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులకు ఈ ఫ్యాక్టరీ ప్రారంభం అస్త్రంగా మారుతోంది తప్ప.. ప్రారంభించిన పాపానపోలేదని మండలవాసులు, నిరుద్యోగులు వాపోతున్నారు. మండలంలోని రాచేపల్లి వద్ద సుమారు 45 ఎకరాల్లో 2000వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం లెదర్ ఫ్యాక్టరీని ప్రారంభించింది. అప్పట్లో 15 మందికి చెన్నైలో శిక్షణ ఇచ్చారు. తర్వాత 2004-2008లో అనంతపురంలోని అంబేద్కర్ భవనంలో మరి కొంతమందికి శిక్షణ ఇచ్చారు. 2006-2008 మధ్యలో రాచేపల్లిలోని లెదర్ ఫ్యాక్టరీ భవనంలోనూ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలకు చెందిన సుమారు 1,500 మందికి వరకూ ఉన్నారు. ఇక్కడ లెదర్ చెప్పులు, లెదర్ బ్యాగులు, లెదర్ బెల్టులు తయారీలో చేసేవారు. ఆ తర్వాత పలు కారణాలతో నెలల వ్యవధిలోనే లెదర్ ఫ్యాక్టరీ మూతబడింది. ఈ క్రమంలోనే ప్రతి ఎన్నకల సమయంలో లెదర్ ఫ్యాక్టరీ ప్రారంభం ఎన్నికల అస్త్రంగా మారుతోంది తప్ప.. ప్రారంభించింది మాత్రం లేదని స్థానికులు వాపోతున్నారు. లెదర్ ఫ్యాక్టరీ ప్రారంభం కాకపోవడంతో మండలంలోని నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు ఫ్యాక్టరీ నిర్మాణానికి దాదాపు 45 మంది ఎస్సీ రైతులు తమ పొలాలను ఇచ్చారు. భూములు తీసుకునేటప్పుడు ఫ్యాక్టరీ ప్రారంభంకాగానే బాధిత రైతు కుటుంబాల్లో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఫ్యాక్టరీని ప్రారంభించింది లేదు.. ఉపాధి కల్పించిందీ లేదని బాధిత రైతు కుటుంబాలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని రాచేపల్లి వద్ద ఉన్న లెదర్ ఫ్యాక్టరీని ప్రారంభించాలని మండల ప్రజలు, నిరుద్యోగులు, భూములు ఇచ్చిన రైతులు కోరుతున్నారు.

రాచేపల్లి వద్ద వృథాగా పరిశ్రమ
నిరుద్యోగుల ఆశలు ఆవిరి

మూతబడిన చెప్పుల పరిశ్రమ భవనం

ఆశలు..అడియాశలు..!

మండలంలోని రాచేపల్లి వద్ద ఉన్న లెదర్ ఫ్యాక్టరీ పున:ప్రారంభం ఆశలు అడియాశలుగానే మారిపోతున్నాయి. ఇక్కడ లెదర్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తే ఉపాధి పొందవచ్చని నేను చెన్నై, అనంతపురంలో శిక్షణ కూడా తీసుకున్నా. అయితే ఫ్యాక్టరీని మాత్రం ప్రారంభించిన పాపానపోలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు కరుణించి లెదర్ ఫ్యాక్టరీని ప్రారంభవిస్తే ఉన్న గ్రామంలోనే ఉపాధి కలుగుతుంది.

-ఓబిలేసు, తరిమెల గ్రామం

భూములు తీసుకుని అన్యాయం చేశారు..

రాచేపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన తోళ్ల పరిశ్రమకు ఎస్సీల భూములు తీసుకుని అన్యాయం చేశారు. భూములు తీసుకున్నప్పుడు పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో దాదాపు 45 మంది రైతులం భూములు ఇచ్చాం. అయితే ఫ్యాక్టరీ ప్రారంభించిన తర్వాత కొన్ని నెలలుకే మూతవేసి తీవ్ర అన్యాయం చేశారు.

రైతు ఓబన్న, రాచేపల్లి గ్రామం

హామీ నిలబెట్టుకోని ప్రజాప్రతినిధులు

లెదర్ ఫ్యాక్టరీని పున:ప్రారంభిస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు చెబుతున్న హామీని నిలబెట్టుకోలేకపోతున్నారు. సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఫ్యాక్టరీని ప్రారంభించి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి.

భాస్కర్, సిపిఎం జిల్లా కౌన్సిల్ సభ్యులు

శాస్త్రీయ ఆలోచనలతోనే దేశాభివృద్ధి : గేయానంద్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

శాస్త్రీయ ఆలోచనలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అభిప్రాయపడ్డారు. ఆదివారం స్థానిక ఎస్వీజీఎం డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కెపి చిత్తప్ప అధ్యక్షతన జిల్లాస్థాయి సైన్స్ చెకుముకి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ ఒక దేశం అభివృద్ధి చెందాలంటే అక్కడి పాలకుల శాస్త్రీయ ఆలోచన మీద ఆధారపడి ఉంటుందన్నారు. సైన్ ఎప్పుడు వాస్తవాలనే తెలియజేస్తుందని, ప్రయోగాత్మకథను నిరూపిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ దానిపై ఆసక్తి కనబరిచినప్పుడే అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో విజయ రహస్యాలను సైన్సుకు ప్రాధాన్యత ఇవ్వడమే ఉద్దేశమన్నారు. పాలకులు నిక్కచ్చిగా అమలు చేస్తేనే ఏదైనా ఫలితం ఉంటుందన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు మాట్లాడుతూ ప్రపంచంలో అతితక్కువ జనాభా ఉన్న దేశాల్లో స్థూల ఉత్పత్తిలో మనకంటే మెరుగ్గా ఉండడానికి అక్కడి పాలకుల నిర్ణయాలు ప్రజల్లో సృజనాత్మకంగా ఆలోచింపజేయడానికి కారణమన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థాయి చేరుకుని దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం చెకుముకిలో జిల్లాలోని 20 మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర అడిట్‌కమిటీ కన్వీనర్ సాకేబాస్కర్, జిల్లా గౌరవ సలహాదారులు మల్లికార్జున, జ్ఞానభారతి విద్యాసంస్థల అధినేత రామేష్‌బాబు, వివేకానంద డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ రామలింగప్ప, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు జగదీష్, రామకృష్ణ, ప్రసాద్, లక్ష్మీనారాయణ, రాజన్న, మాన్తేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

రైతులకు అనుకూలంగా మార్కెట్ యార్డులు

మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి నరసింహమూర్తి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

రైతులు పండించిన తమ ఉత్పత్తులను సమీప మార్కెట్ యార్డులలో దళారుల బెడద లేకుండా విక్రయించుకునే ఒదుకు జిల్లాలో మార్కెట్ యార్డులు అందుబాటులో ఉన్నాయని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి నరసింహమూర్తి చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతుంటారు. సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం పంట ఉత్పత్తులను దాచుకునే సదుపాయం లేకపోవడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసి పలు సదుపాయాలను అందిస్తోందని శ్రీసత్యసాయి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ ఎంఎల్. నరసింహ మూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న:- జిల్లాలో ఎన్ని మార్కెట్ యార్డులు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఇందులో శీతల గిడ్డంగులు ఉన్నాయా?

ఎడి: జిల్లాలో 8 మార్కెట్ యార్డులు ఉన్నాయి. ధర్మవరం, గోరంట్ల, హిందూపురం, కదిరి, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు, తనకల్లులో ఉన్నాయి. ఇందులో శీతల గిడ్డంగులు ప్రభుత్వపరంగా లేవు. ఎవరైనా ప్రయివేటు వ్యక్తులు శీతల గిడ్డంగులు ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి భూమి సదుపాయం కల్పిస్తాం. ఆ గిడ్డంగులలో నిలవచేసే సరుకులకు వారు సుంకం వసూలు చేసుకోవచ్చు. హిందూపురంలో ఆ విధంగా ముందుకు వచ్చి శీతల గిడ్డంగులు కొందరు నిర్మించుకున్నారు.

ప్ర: జిల్లాల్లో మార్కెట్ యార్డుల నిర్వహణ ఏమిటి.?

ఎడి: జిల్లాలో ధాన్యం నిలువ చేసుకునే గిడ్డంగులు అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ ఉన్నాయి. ఆ గిడ్డంగులలో నామమాత్రపు ఫీజు చెల్లించి ఎన్ని రోజులైనా పంటను నిలువ చేసుకునే అవకాశం ఉంది. పెద్ద మార్కెట్లు కలిగిన పట్టణాల్లో ఉండే మార్కెట్ యార్డుల్లో రోజువారి లేదా వారానికి ఒకసారి రైతులు తమ ఉత్పత్తులను వేలం ద్వారా విక్రయించుకునే అవకాశం ఉంటుంది. వ్యాపారులు వేలం పాటలలో పాల్గొంటారు. దీనివల్ల రైతులు దళారుల బారిన పడకుండా తమ ఉత్పత్తులను విక్రయించుకునే వెసులుబాటు ఉంది.

ప్ర: మార్కెట్ యార్డులలో ఎయే సరుకులు విక్రయాలు ఉంటాయి? ఎన్ని గిడ్డంగులు ఉన్నాయి?

ఎడి: ప్రధానంగా వ్యాపార కూడలి అయిన హిందూపురంలో చింతపండు, వట్టి మిరప, తదితర సరుకులు క్రయవిక్రయాలు ఉంటాయి. ఇవి గాక రోజువారి వస్తువుల వ్యాపారాలు జరుగుతుంటాయి. గోరంట్ల, కదిరి, కొత్తచెరువు యార్డులలో పశువుల వారపు సంతలు జరుగుతాయి. అందులో పశువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ధర్మవరంలో మామిడికాయల సీజన్లో ఎక్కువగా ఆ కాయల విక్రయాలు జరుగుతుంటాయి. ఈ యార్డుల్లో 30 వరకు గిడ్డంగులు ఉన్నాయి. ఇవి గాక ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో కూడా గిడ్డంగులు ఉన్నాయి.

ప్ర: మార్కెట్ యార్డుల వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయి? చెక్ పోస్టుల పని విధానం ఏమిటి?

ఎడి: మార్కెట్ యార్డులలో రైతులు తమ పంటల ఉత్పత్తులను నామమాత్రపు ఫీజులతో నిలువ చేసుకోవచ్చు. దళారుల బెడద లేకుండా స్వేచ్ఛగా తమకు నచ్చిన ధరకు సరుకు విక్రయించుకోవచ్చు. జిల్లాలో 12 చెక్ పోస్టులు ఉన్నాయి. బత్తలపల్లి, రాళ్లఅనంతపురం, గుమ్మయ్యగారిపల్లి, పాలసముద్రం, కొడికొండ, మేళాపురం, కుటాగుల్ల, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు, మహమ్మదాబాద్ క్రాస్, కొక్కంటి క్రాస్ ప్రాంతాలలో చెకో పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా చట్ట వ్యతిరేకంగా ఇతర రాష్ట్రాలకు వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసే వాహనాలను ఈ చెకపోస్టులలో తనిఖీ నిర్వహించి, అక్రమంగా తరలిస్తుంటే తగిన చర్యలు తీసుకుంటాం. రైతు వారి ఉత్పత్తులకు సంబంధించి సరైన పత్రాలు చూపించి ఎక్కడైనా విక్రయించుకునే సదుపాయం ఉంది. తన ఉత్పత్తులకు సంబంధించి పాస్ పుస్తకం, వన్ బి తదితర పత్రాలను చెక్కు పోస్టులల్లో అధికారులకు చూపించాల్సి ఉంటుంది.

ప్ర : ఏటా మార్కెట్ యార్డుల ద్వారా ఎంత మొత్తం ఆదాయం ఉంటుంది? అన్నింటికి భవన సముదాయాలు ఉన్నాయా.?

ఎడి: జిల్లాలోని 8 మార్కెట్ యార్డుల ద్వారా సుమారు రూ.5కోట్లు ప్రభుత్వానికి పన్నుల రూపంలో వస్తోంది. చెకోపోస్టుల్లో తనిఖీల ద్వారా వచ్చిన డబ్బును మరుసటి రోజే చలానా ద్వారా సిబ్బంది చెల్లించాల్సి ఉంటుంది. కొత్తచెరువు, గోరంట్ల యార్డుల్లో అధికారుల కార్యాలయాల భవనాలు చిన్నగా ఉన్నాయి. వాటిని పెద్దగా నిర్మించాల్సి ఉంది. చాలా యార్డుల్లో సిసి రహదారులు, డ్రెయినేజీ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. వీటిపై ప్రభుత్వానికి నివేదికలు ప్రతిపాదించాం.

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా? రైతులకు మీరు ఇచ్చే సూచనలు, సలహాలు ఏమిటి?

ఎడి: మార్కెట్ యార్డులలో దాదాపు 50 శాతం సిబ్బంది అవసరం అవుతుంది. ఉన్న వారితోనే కొనసాగిస్తున్నాం. ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు ప్రతిపాదించాం. రైతులు తమ ఉత్పత్తులను దళారుల బారిన పడకుండా మార్కెట్ యార్డుల ద్వారా గిట్టుబాటు ధరలకు విక్రయించుకోవచ్చు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నేడు కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ప్రకనటలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు తమ ఆధార్, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. గతంలో ఇచ్చిన అర్జీల పరిష్కారం అయిఉంటే ఫోన్‌కు సమాచారం వస్తుందన్నారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్‌ను వాట్సప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్‌మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్‌కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరటి రైతులు ఆందోళన చెందవద్దు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

జిల్లాలో అరటి పంట సాగు చేసిన రైతులు ఆందోళన చెందవద్దని.. త్వరలోనే గిట్టుబాటు ధర కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. రాష్ట్రంలోని అరటి పంట మార్కెట్ ధరల్లో నెలకొన్న పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షించేందుకు ఉద్యానశాఖ డైరెక్టర్ అధ్యక్షతన ఆదివారం రాష్ట్రస్థాయి అంతర్జాల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇందులో ఆయా కంపెనీల ప్రతినిధులు పలు అంశాలను వెల్లడించారు. నాణ్యత ఉన్న అరటి పంటకు ప్రస్తుతం రూ.7.50 నుంచి రూ.8.00 వరకు ధరలు ఉన్నాయన్నారు. అయితే నాణ్యత లేని పంటను కొందరు లోకల్ ట్రేడర్లు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్న విషయం గుర్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అరటి రైతులకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలోని అరటి రైతులందరూ మంచి వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. నాణ్యత పెంచితే మార్కెట్లో గరిష్ట లాభాలు పొందవచ్చన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు.

నేటి నుంచి 'రైతన్న- మీకోసం'

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఆదివారం నుంచి రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బందితోపాటు సచివాలయంలో పని చేసే ఉద్యోగులు రోజూ 90 కుటుంబాలను కలిసి పంచసూత్రాలను వివరిస్తారన్నారు. ముఖ్యంగా అగ్రిటెక్‌పైన అవగాహన కల్పించి ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం, రసాయనిక ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటం వల్ల కలిగే నష్టాలను వివరించనున్నట్లు తెలిపారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఆదివారం నుంచి రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్యామసుందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 29వ తేదీవ వరకూ ఉంటుందన్నారు.

ఆత్మకూరు : మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఆదివారం నుంచి రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పివి జ్యోతికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రైతు సేవా కేంద్రం సిబ్బందితోపాటు సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు రోజూ 90 కుటుంబాలను కలిసి పంచసూత్రాలను వివరించనున్నట్లు తెలిపారు.

చెస్ టోర్నీలో రాణించిన జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-అనంతపురం

తమిళనాడులోని హోసూరులో ఉన్న ఆదియమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు జరిగిన లిటిల్ ఇంగ్లాండ్ 5వ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ – 2025లో అనంతపురం జిల్లా క్రీడాకారులు రాణించారు. ప్రపంచవ్యాప్తంగా 201 మంది క్రీడాకారులు పాల్గొనగా స్విస్ లీగ్ పద్ధతిలో 9 రౌండ్లు పోటీలు నిర్వహించారు. 5.5/9 పాయింట్లతో ఇంటర్నేషనల్ ఆర్బిటర్, ఏ1 చెస్ అకాడమీ సీనియర్ చెస్ కోచ్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు బిలో 1451-1600 రేటింగ్ కేటగిరిలో రన్నరప్ టైటిల్ కైవసం చేసుకుని రూ.25వేల నగదు బహుమతి, స్మార్ట్ టీవీ, ట్రోఫీని కైవసం చేసుకున్నారు. అండర్ - 15 బాలికల విభాగంలో జిల్లా క్రీడాకారిణి శ్రీహ 3వ స్థానం సాధించి ట్రోఫీని అందుకున్నారు.

ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

ప్రమాద బాధితులకు పరామర్శ

బాధితున్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం టౌన్ : ప్రమాదంలో గాయపడి బాధితులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం పరామర్శించారు. కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన రామాంజినేయులు, కరణం అశ్వర్థ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ఆయా ఆసుపత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించడంతోపాటు ఆర్థికసాయం అందించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆయా వైద్యులతో సూచించారు. అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

శింగనమల : మండలం వెస్ట్ నరసాపురం గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన లక్ష్మీదేవి కుటుంబానికి ఆమెతోపాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ముందుగా లక్ష్మీదేవి కుటుంబానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత పూర్వ విద్యార్థులు పోగు చేసిన రూ.లక్ష ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో లక్ష్మీదేవి పిల్లలకు అండగా ఉంటామని పూర్వ విద్యార్థి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అన్నదానం

కళ్యాణదుర్గం టౌన్ : సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో అన్నదానం చేశారు. ఇందులో భాగంగా సాయి సేవకులు డాక్టర్ రాజేష్ పాల్గొని పలువురికి అన్నదానం చేసి సత్యసాయి సేవలను గుర్తుచేసుకున్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) RAYADURG
Original Suit No. 122 of 2022
Between:
Andhra Pragathi Grameena Bank, Rayadurg, represented by its Branch Manager ...**Plaintiff**
AND
Renuka Srinivasulu ...**Defendant**
NOTICE TO THE DEFENDANT
Renuka Srinivasulu, S/o Ramakrishna, D. No. 1-5-711/A, 1st ward, Shanthi Nagar, Rayadurg Town,
Please take notice that the above named Plaintiff has filed the above Suit for the recovery of the amount due under the documents executed by you in favour of the Plaintiff and the same stands posted to 28/11/2025, for your appearance. So, you are hereby directed to appear before the Honourable above Court at 10.30 a. m. on 28/11/2025 either in person or through the counsel without fail, with all the documentary evidence on which you propose to defend the matter. If you fail to appear on that day, you will be set exparte and the matter will be determined exparte.
(By order of the Honourable Court)
SRI Y.H BABU RAO,
Advocate, Rayadurg

తూతూమంత్రంగా బిటి రోడ్డు ప్యాచ్‌వర్క్‌లు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-యల్లనూరు

తాడిపత్రి నుంచి యల్లనూరు వరకూ ఉన్న బిటి రోడ్డుకు తూతూమంత్రంగా ప్యాచ్ వర్క్‌లు చేస్తూ మమ అంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలతో తాడిపత్రి నుంచి యల్లనూరు వరకూ ఉన్న బిటి రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ఆర్అండ్‌బి అధికారులు రూ.6లక్షలతో గుంతలకు తారుతో కూడిన సిప్‌ను వేసేందుక నిధులు మంజూరు చేశారు. అయితే ఇందులో చిన్నపాటి గుంతలకు మాత్రమే ప్యాచ్‌లు వేసి పెద్దపాటి గుంతలను విడిచివెళ్లారు. ఫలితంగా రవాణా ప్రయాణికులు మండిపడుతున్నారు. అంతేగాకుండా తాడిపత్రి నుంచి పాతపల్లి వరకు వేయాల్సిన ప్యాచ్‌లు.. యల్లనూరుకు వస్తూనే గుంతలకు తారు వేయకుండా వదిలిపెట్టి తిరిగి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల నుంచి వేశారు. దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే స్థానిక హిందూస్తాన్ పెట్రోల్ బంక్ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. కావున ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తారు రోడ్డును నాణ్యతగా వేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తూతూమంత్రంగా ప్యాచ్‌లు వేస్తున్న కార్మికులు

ఘనంగా సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ అధ్యక్షతన బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. సత్యసాయి బాబా బోధనలు విశ్వ ప్రేమ, సేవ, శాంతి అనే భావాలను విస్తరింపజేశారన్నారు. ఆయన జీవితం మనందరికీ ఒక సందేశం అన్నారు. పలు సేవా కార్యక్రమాలను చేశారని విద్యా, వైద్య ఆధ్యాత్మిక తదితర రంగాలలో వారు విస్తతంగా సేవలు నేటికీ కొనసాగుతున్నాయని కొనియాడారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాకు తాగు నీరు అందించడం వంటి అనేక కార్యక్రమాలు వారి సేవా తత్పరతకు గొప్ప నిదర్శనం, అనేక మందికి ప్రేరణ అని తెలిపారు. సత్యసాయి బాబా సేవలను, స్ఫూర్తిని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. జిల్లా సత్య సాయి సేవా సమితి నుంచి పలువురు మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా సాక్షాత్తు దైవ స్వరూపులు అన్నారు. వారు ఎన్నో మహిమలు చూపించారనీ, వారి ప్రబోధనలు విశ్వ వ్యాప్తంగా ప్రసిద్ధి అని కొనియాడుతూ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సత్య సాయి జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలోడిఆర్ఒ ఎ.మలోల, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకట శివుడుయాదవ్, వీరశైవ లింగాయత్ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ స్వప్న, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా లక్ష్మీనరసింహమూర్తి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవానీ రవికుమార్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసింహులు, రజక సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మిటెడ్ డైరెక్టర్ కమలమ్మ, ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్ వెంకటప్ప, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఆర్.రామచంద్రమూర్తి, కన్వీనర్ నరసింహప్ప, సత్యసాయి జిల్లా బాల వికాస్ సమన్వయ కర్త గీతా సుకుమార్, ఆధ్యాత్మిక కో ఆర్డినేటర్ గంగాధర్, బీసీ వెల్ఫేర్ అధికారిని ఖుష్బూ కొఠారి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి బాబాకు నివాళులర్పిస్తున్న జెసి శివ్‌నారాణ్‌శర్మ

గిరిజన హక్కుల సాధనకు ఐక్య పోరాటం

జిపిఎస్ఎస్ ఆవిర్భావ సభలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గిరిజనుల హక్కులు సాధించుకోవడం, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుదామని పలువురు వక్తలు అన్నారు. గిరిజన ప్రజా సంక్షేమ సంఘం (జిపిఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు గర్మా.మల్లికార్జున నాయక్ అధ్యక్షతన ఆదివారం గిరిజన భవన్‌లో ఆవిర్భావ సభను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అంబేద్కర్, పూలే, సేవాలాల్, ఏకలవ్యుడు, చిత్రపటాలకు పూలుమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలుసంఘాల నాయకులు మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 77 సంవత్సరాల అయినప్పటికీ గిరిజనులు నేటికీ కూడు, గూడు, నీడ కోసం పరితపిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులు అమలు పూర్తి స్థాయిలో జరగకపోవడం విచాకరకరం అన్నారు. గిరిజనులు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాలలో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో గిరిజనులకు హామీలు ఇస్తూ మభ్యపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో గిరిజనులందరూ సంఘటితం కావాలని, నాయకులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సీనియర్ నాయకుడు ఎస్.కె కేశవనాయక్, గోరంట్ల జడ్పిటిసి పాలెం జయరాంనాయక్, ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు చింతా చంద్రమోహన్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరిమెట్ల ఎల్లన్న, ఎస్సీ ఎస్టీ ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ డి.రవిరాజ్, గిరిజన నాయకులు శ్రీనివాసులు నాయక్, బాలాజీ నాయక్, డి.నారాయణస్వామి, విద్యార్థి నాయకుడు సురేష్ యాదవ్, గిరిజన ఉపాధ్యాయ సంఘం రవీంద్ర నాయక్, రాజీవ్ చిల్డ్రన్ పార్క్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు లింగం నాయుడు, కేశవ నాయుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి మంత్రి సుదర్శన్, లాయర్ సురేష్ నాయక్, దాసునాయక్, బొజ్జే నాయక్, లెక్చరర్ రాకేష్, గిరిజన విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభలో మాట్లాడుతున్న వక్తలు

అన్నదానం చేస్తున్న దృశ్యం

ఆశ్రమంలో అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కోవూరునగర్‌లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవా స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో 34 మంది విద్యార్థులకు అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు దామోదర్ గుప్తా పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నాలుగు రకాల తిను బండారాలను (స్నాక్స్) అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు స్వామి సత్యాత్మానంద, చక్రపాణి, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన 'దండు'

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆదివారం అనంతపురం రైల్వేస్టేషన్‌లో శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలకు హాజరై తిరిగి వెళ్తున్న మంత్రిని దండు శ్రీనివాసులు కలిశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దాసరి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి బొకే అందజేస్తున్న దండు శ్రీనివాసులు

మధ్యాహ్న భోజన ఏజెన్సీల కడుపుకొడితే ఊరుకోం

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల కడుపుకొట్టే నిర్ణయాలు తీసుకుంటే ఊరుకునేది లేదని మధ్యాహ్న భోజన ఏజెన్సీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి స్పష్టం చేశారు. ఆదివారం కళ్యాణదుర్గంలో యూనియన్ జిల్లా కోశాధికారి సరస్వతితో కలిసి మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రీకృత వంటశాలలు ఏర్పాటుతో డొక్కాసీతమ్మ బడి భోజన పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. ప్రయివేట్ సంస్థలకు భోజన ఏజెన్సీలను అప్పగిస్తే పిల్లలకు సరైన సమయంలో పౌష్టికాహారం అందకుండా పోతుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో భోజన తయారీ సెంటర్లు ఏర్పాటు చేసుకుని పాఠశాలలకు భోజనాన్ని సరఫరా చేస్తే ఆమధ్య సమయంలో భోజనం చల్లారి రుచి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎక్కడి ఏజెన్సీ అక్కడే భోజనం చేస్తే పిల్లలకు వేడివేడి భోజనం అందుతుందన్నారు. ఇప్పటికే ఇస్కాన్ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం పిల్లలకు రుచిలేక పడేస్తున్నారని వాపోయారు. అంతేగాకుండా పిల్లలకు భోజనంలో నాణ్యత తగ్గడమే కాకుండా 23 ఏళ్లుగా పని చేస్తున్న భోజన ఏజెన్సీ కార్మికులు అన్యాయం చేయడమే అన్నారు. మెనూ ఛార్జీలు పెంచి స్మార్ట్ కిచెన్ సెంటర్ల నిర్వహణను విరమించకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో భోజన ఏజెన్సీ కార్మికులు అనంతమ్మ, రామాంజినేయులు, వసూరమ్మ, మంజునాథ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి

ఘనంగా ఎన్‌సీసీ డే

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని ప్రభుత్వ కళాశాల (ఆటానమస్)లో ఆదివారం ఎన్‌సిసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి నిరోధక శాఖ సిఐ ఎం.జయమ్మ దేశ ఏకతా, సమగ్రతను కాపాడడం, క్రమశిక్షణపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఎం.నాగశశికళ, వాణిజ్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, లెఫ్టినెంట్ జి.రంగనాథం, ఎన్‌సీసీ యూనిట్ల చీఫ్ ట్రైనింగ్ ఆఫీసర్లు, లెఫ్టినెంట్ జి.చిన్న వెంకటమ్మ, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.రమణాంజనేయులు, అధ్యాపకులు ఇ.అహ్మద్, ఆంగ్ల విభాగం లెక్చరర్, విష్ణుప్రకాష్, అకడమిక్ కోఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్లతో అతిథులు

రైతు సంఘం మహాసభల పోస్టర్ విడుదల

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని ఎరుగుంటపల్లి గ్రామంలో ఆదివారం రైతుసంఘం 13వ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నవంబర్ 26, 27వతేదీల్లో గార్లదిన్నె మండలంలో రైతుసంఘం మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్, వివిధ జిల్లాల నాయకులు రైతు సంఘం ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న రైతుసంఘం నేతలు

చీరలు పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి : పట్టణంలోని పేద మహిళలకు ఆదివారం శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం చీరలు పంపిణీ చేశారు. పుట్టపర్తి సాయిబాబా జయంతిని పురస్కరించుకుని పట్టణానికి చెందిన డిఆర్ రాజేంద్రసాయి చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవాసమితి నాయకులు సత్యనారాయణరెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

తమ్మిశెట్టి వెంకటస్వామికి నివాళి

గుత్తి : జమిందార్ సూర్యవంశ వడియారాజుల సంఘం వ్యవస్థాపకులు కందులపురం తమ్మిశెట్టి వెంకటస్వామి జయంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సూర్యవంశం వడియరాజుల సంఘం అధ్యక్షుడు పీట్ల చిరంజీవి, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, గౌరవాధ్యక్షుడు హనుమంతు, నాయకులు సుధాకర్, నాగరాజు, రంగనాయకులు, తిరుపతయ్య, వెంకటరాముడు, వెంకటేష్, వీరాంజనేయులు, వీరన్న, మునేష్, టిడిపి పట్టణ కార్యదర్శి బత్తల మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తమ్మిశెట్టి వెంకటస్వామికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సత్యసాయి జయంతి వేడుకలు

అన్నదానం చేస్తున్న దృశ్యం

బెలుగుప్ప : పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని సత్య సాయిబాబా భజన మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం బంగారు షాపు మల్లికార్జున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి బాబా కమిటీ సభ్యులు కాశీనాథ్, దొన తిమ్మరాయుడు, పాటిల్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున, శ్రీధర్, హరి, సాయి, ఓంసాయి, హనుమంతప్ప, కమిటీ మహిళా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి

అనంతపురం : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24వతేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబర్ 89777 16661కు కాల్ చేసి విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం : రెండు తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు జాప్ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర యాదవ్ వినతిపత్రం అందించారు. ఇటీవల జిల్లాకు విచ్చేసిన నారా లోకేష్‌కు జర్నలిస్టులు వివిధ విభాగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

క్విజ్ పోటీలు

అనంతపురం : ఐఇఇఇ హైదరాబాద్ సెక్షన్ రిలయబిలిటీ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్‌లో అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కాళాశాల విద్యార్థులు సుమారు 490 మంది ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రర్ చేసుకున్నారు. వీరిలో 281 మంది విద్యార్థులు హాజరై ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ది ఇండియన్ ఇన్ స్టియూషన్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రథమ ఉపాధ్యక్షుడు విశ్రాంత వేలమూరి శంకర్ తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : సాంస్కృతి సంప్రదాయాల సమాహారం శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి. డాన్స్ మాస్టర్ సురేష్, ప్రముఖ గాయని మాధురి గణ విభావరి అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాకారులు గాయిని మాధురి, ముధగం నాగరాజు, ప్యాడ్ ప్లేయర్ దురేగేష్, ధోల్కాపూర్ ఆంటోని, తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న కళాకారులు

నేరాలు ఘోరాలు

తృటిలో తప్పిన ప్రమాదం

జన నివాసాల మధ్య ఇరుక్కున్న ట్రాక్టర్

యల్లనూరు : మండల కేంద్రంలోని వెంకయ్య కాలువ గ్రామానికి వెళ్లే రహదారిలో నివాసాల మధ్య ఆదివారం ఉదయం నల్లబండల ట్రాక్టర్ గుంతలో పడిపోయింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రమేష్, వ్యవసాయ కార్మికుల సంఘం సభ్యులు ఓబులేసు మాట్లాడుతూ మండల కేంద్రంలోని వెంకయ్య కాలువకు వెళ్లే రోడ్డు చాలాకాలంగా అధ్వాన్నంగా ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వెంకయ్య కాలువ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.